క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ అధినేతతో ఎమ్మెల్యే ఆకేపాటి భేటి


వైఎస్ జగన్‌ను కలిసిన ఆకేపాటి

రాజంపేట : మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో రాజంపేట ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి అమరనాథరెడ్డి సోమవారం భేటి అయ్యారు. తాడేపల్లిలోని జగన్ నివాసానికి ఆకేపాటి వెళ్లారు. పలు రాజకీయ అంశాలు చర్చించారు.

13న అభివృద్ధి ప్రణాళికలపై శిక్షణ

రామాపురం : మండలంలోని 13 గ్రామ పంచాయతీలకు 2025 – 26 ఆర్థిక సంవత్సరానికి గాను గ్రామ పంచాయతీ డెవలప్‌మెంట్ ప్లానింగ్ (జీపీడీపీ) తయారు చేసేందుకు జిల్లా పరిషత్ సీఈఓ ఆదేశాల మేరకు ఒకరోజు శిక్షణ ఇవ్వనున్నట్లు ఎంపీడీఓ జాషువా తెలిపారు. మండలంలోని 13గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీ, ఎంపీపీ, అన్ని శాఖల అధికారులు శిక్షణకు హాజరుకావాలని ఆయన కోరారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడదాం


రీసైక్లింగ్‌పై అవగాహన కల్పిస్తున్న టీచర్లు

చిన్నమండెం : పర్యావరణ పరిరక్షణకు పునరుద్ధరణే ప్రాణం అని మల్లూరు జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు రెడ్డన్న తెలిపారు. సోమవారం మండల పరిధిలోని మల్లూరు జెడ్పీ హైస్కూల్‌లో రీసైక్లింగ్ ప్రోగ్రాంను నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ పుస్తకాలను తయారు చేయాలంటే చెట్లను నరికి వాటి కలప, కాండంను ఉపయోగించాలన్నారు. చెట్లను నరికి వేయడం వలన పుస్తకాలు తయారవుతాయని విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బహుమతుల ప్రదానం


బహుమతులు అందుకున్న విద్యార్థులు

ఓబులవారిపల్లె : స్వాతంత్ర్య సమరయోధులు, భారత ప్రభుత్వ మొట్టమొదటి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్‌ను ఆదర్శంగా తీసుకోవాలని కరస్పాండెంట్ యువరాజు పేర్కొన్నారు. సోమవారం స్థానిక శ్రీ రిషీ అప్పర్ ప్రైమరీ పాఠశాలలో జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

వీధి లైట్లకు మరమ్మతులు

సంబేపల్లె : గ్రామ అభివృద్దే ధ్యేయమని సంబేపల్లె గ్రామ సర్పంచ్ రామచంద్ర పేర్కొన్నారు. గత కొద్దిరోజులుగా మండల కేంద్రంలోని వీధి లైట్లు చెడిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీనిని గమనించి సర్పంచ్ సోమవారం విద్యుత్ స్తంబాలకు అమర్చిన లైట్లను పరిశీలించి చెడిపోయిన లైట్లను మరమ్మతులు చేయడంతోపాటు పూర్తిగా పనికి రాని లైట్లను తొలగించి కొత్త లైట్లు ఏర్పాటు చేశారు. గత వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వంలో ప్రజలకు ఎన్నో సేవలు అందించామన్నారు. గ్రామ అభివృద్ధికి నిత్యం కృషి చేస్తానన్నారు.

ఆలయానికి విరాళం


విరాళం అందజేస్తున్న దాత సుబ్బరాయుడు

నందలూరు : నాగిరెడ్డిపల్లి గ్రామంలోని శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయం నిర్మాణానికి అరవపల్లికి చెందిన విశ్రాంత ఎల్‌ఐసీ ఏఓ మాడపూరి సుబ్బరాయుడు, ఆయన ధర్మపత్ని మాడపూరి హేమలత వారి కుటుంబ సభ్యులు ఒక పిల్లర్ నిర్మాణానికి రూ. 52,116లు విరాళంగా ఆలయ ప్రతినిధి ఏనుగుల బాలాంజనేయులకు సోమవారం అందజేశారు.

అలరించిన భరతనాట్య ప్రదర్శన

రాయచోటి టౌన్ : వీరభద్రస్వామి ఆలయంలో నిర్వహించిన ఆధ్యాత్మిక ప్రదర్శనలు భక్తులను అలరించాయి. ఉదయం నుంచి శివాలయంలో విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ఆధ్యాత్మిక ప్రదర్శనలు జరిగాయి. ఈ ప్రదర్శనలలో భాగంగా నాగేంద్ర యాదవ్ ఆధ్వర్యంలో భరతనాట్య ప్రదర్శన అలరించింది. కళాకారుడు తుమ్మల హరినాథ ఆధ్వర్యంలో లక్ష్మీపురానికి చెందిన మహిళలతో కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. ప్రదర్శన చేసిన కళాకారులకు ఆలయం కమిటీ సభ్యులు ప్రశంసా పత్రాలు అందజేశారు.

నోరూరిస్తున్న కారు మామిడి!

- ఇతర రాష్ట్రాల నుంచి రాయచోటికి దిగుమతి
- కిలో రూ.200లకు విక్రయం
- కొనేందుకు ఆసక్తి చూపతున్న మామిడి ప్రియులు


మార్కెట్‌లో విక్రయిస్తున్న కారు మామిడి పండ్లు

రాయచోటి టౌన్ : సీజనల్‌వారీగా పండే పండ్లలో మామిడి పండ్లు ముందు వరుసలో నిలుస్తాయి. అలాంటివి ఇప్పుడు సీజన్‌తో పాటు నడికారు (అన్ సీజన్) ఇలా రెండు సీజన్‌లుగా కాస్తున్నాయి. గత ఏడాది వర్షాలు సక్రమంగా కురవకపోవడంతో సీజన్‌లోనే పంట దిగుబడి రాలేదు. దీంతో రైతులు దిగాలు పడ్డారు. అలాగే ఈ ఏడాది కూడా సమృద్ధిగా వర్షాలు కురవకపోవడంతో మామిడి పంట దిగుబడి ఆశాజనకంగా రాదేమోనని రైతులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా 43 వేల ఎకరాలకు పైగా మామిడి సాగులో ఉంది. నడికారు మామిడి పండ్లు (లోకల్ మామిడి పండ్లు) సెప్టెంబర్ – అక్టోబర్ నెలలో మార్కెట్‌లోకి వస్తుంటాయి. అందుకు భిన్నంగా ఇప్పుడు మార్కెట్‌లోకి మామిడి పండ్లు రావడం విశేషంగా ఉన్నాయి. సాధారణంగా ఈ నెలాఖరులోగా పూత రావాలి. ఇప్పటి వరకు పూత రాలేదు. ఇతర రాష్ట్రాలలో పండిన మామిడి పండ్లు దిగుమతి చేసుకొంటున్నారు.

పండ్ల వ్యాపారానికి రాయచోటి కేంద్రంగా నిలుస్తుంది. ఇతర రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర దేశాల నుంచి అనేక రకాల పండ్లు రాయచోటికి వస్తుంటాయి. ఇక్కడ నుంచి మండీ వ్యాపారులు ఇతర జిల్లాలకు ఎగుమతి చేస్తుంటారు. జిల్లా వ్యాప్తంగా ఎక్కడ ఎలాంటి పండ్లు పండినా రాయచోటి కేంద్రంగా ఎగుమతులు అవుతుంటాయి. అలాగే ఇతర జిల్లాల నుంచే కాకుండా ఇతరా రాష్టలు, దేశాల నుంచి అనేక రకాల పండ్లు రాయచోటి ప్రజలకు విందు చేస్తుంటాయి. అలాంటి వాటి స్థానంలో ప్రస్తుతం రాయచోటి మార్కెట్‌లోకి అప్పుడే మామిడి పండ్లు వచ్చేశాయి. మామిడి పండ్ల ప్రియులకు నోరూరించే విధంగా మామిడి పండ్లు కనువిందు చేస్తున్నాయి. అయితే అదే స్థాయిలో ధరలు కూడా భయపెడుతున్నాయి. కిలో రూ.200లుగా అమ్ముతున్నారు. మామిడి పండ్ల ప్రియులు మాత్రం ధరను లెక్క చేయకుండా వాటిని కొనుగోలు చేస్తున్నారు.

వర్షాభావంతో తగ్గిన కారుమామిడి



సాధారణంగా మన ప్రాంతంలో అయితే కారు మామిడి కాయలు మార్కెట్‌లోకి వస్తుంటాయి. అయితే ఈ ఏడాది వర్షాభావ పరిస్థితి కారణంగా మన ప్రాంతంలో మామిడి కాయలు కాయలేదు. అయితే బోరు బావుల ఆధారంగా సాగు చేసిన తోటలలో అయితే అక్కడక్కడ కొన్ని చెట్లకు మాత్రమే కాయలు కాశాయి. అయితే ప్రస్తుతం అవి చిన్న కాయలు మాత్రమే. పండిన కాయలు మాత్రం మన ప్రాంతానికి చెందినవి కావు. ఇతర రాష్ట్రాల నుంచి (బెంగుళూరు) నుంచి వ్యాపారులు దిగుమతి చేసుకొంటున్నారు.

– నాగమణి, ఉద్యానశాఖ అధికారిణి, రాయచోటి

మంచి డిమాండ్ ఉంది



రాయచోటిలో మామిడి పండ్లకు మంచి డిమాండ్ ఉంది. అందుకే ఇతర రాష్టల నుంచి ఇక్కడి మండీలకు దిగుమతి అవుతాయి. అక్కడ నుంచి మేము కొనుగోలు చేసి ఇలా వ్యాపారం చేస్తాం. అయితే ధరలు మాత్రం కాస్త ఎక్కువగా ఉంటుంది. సీజన్‌లో అయితే ఇవే మామిడిపండ్లు (లాల్‌బహార్ మామిడి) రూ.50ల వరకు పలుకుతాయి. కానీ ఇవి సీజన్ కాదు కాబట్టి మామిడి పండు తినాలనే ఆశ ఉన్న (ప్రియులు) ధర ఎంతైనా సరే కొంటారు. ఇవి కూడా కొన్ని మాత్రమే వచ్చాయి. మార్కెట్లో ధరలు పలుకుతాయో లేదోనని తక్కువ తీసుకొచ్చారు.

– పఠాన్ మస్తాన్ ఖాన్, చిరువ్యాపారి

వానలు లేక ఇబ్బందులు



గతంలో అయితే మా తోటలో కారు మామిడి కాయలు కాసేటివి. కానీ వర్షాభావం కారణంగా కాయలు కాయలేదు. ప్రస్తుతం పూత మొదలయ్యింది. ఇప్పటికీ లేత చిగురు వస్తోంది. అంటే ఈ ఏడాది పూత సమయానికి రాదనే ఆలోచనలో ఉన్నాం. గత సంవత్సరంలో దిగుబడి పడిపోయింది. ఈ సంవత్సరమైన మంచి దిగుబడి వచ్చి మార్కెట్‌లో సరైన రేటుకు వెళితే బాగుంటుంది.

– శ్రీనివాసులు, రైతు, దూళ్లవారిపల్లె

కోడూరులో పారిశుధ్య పనులు


పారిశుధ్య పనులు పర్యవేక్షిస్తున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

రైల్వేకోడూరు అర్బన్ : పారిశుధ్యం...అస్తవ్యస్తం అనే శీర్షికపై ఆదివారం సాక్షి పత్రికలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో రైల్వేకోడూరు హెల్త్ సూపర్‌వైజర్ కె.బాలకృష్ణమరాజు ఆధ్వర్యంలో రైల్వేకోడూరు ప్రభుత్వ ఆసుపత్రి, ధర్మాపురం తదితర ప్రాంతాలలో సోమవారం శానిటేషన్ నిర్వహించి ప్రతి ఇంట్లో జ్వరాల సర్వే చేపట్టారు.

బాధ్యతల స్వీకరణ


ఎస్‌ఎం అలీ, సీఐ, మన్నూరు

రాజంపేట : మన్నూరు సీఐగా ఎస్‌ఎం అలీ సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాఖపరంగా ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు తాను ఎల్లప్పుడూ ముందుంటానన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అందరి సహకారంతో మన్నూరు సర్కిల్ పరిధిలో నేరాల అదుపునకు పకడ్బందీగా చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీఐను మన్నూరు పోలీసులు ఘనంగా స్వాగతం పలికారు.

తెగుళ్ల నివారణకు చర్యలు చేపట్టాలి

సిద్దవటం : మండలంలోని మాచుపల్లె రైతుసేవా కేంద్రంను సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశామని బద్వేల్ సహాయ వ్యవసాయ సంచాలకులు నాగరాజ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన పలు రికార్డులను పరిశీలించి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యసాయ సిబ్బందితో సమీక్ష జరిపారు. వరి, ఉల్లి పంటలను పరిశీలించి పొట్టకుళ్లు, పాముపొడ తెగుళ్లను గమనించామన్నారు. మల్లు రమణారెడ్డి ఉల్లి పంటలో బంగారు తీగ(కస్క్యుట) అనే కలుపు మొక్కను గుర్తించామన్నారు. భాగ్యలక్ష్మి అనే ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పొలంలో ఏటీఎం మోడల్‌ను పరిశీలించి వంగలో పొగాకు లద్దె పురుగు, సన్ననిమ్మలో సిట్రస్ బట్టర్ ఫ్లై అనే పురుగులను గుర్తించామన్నారు. కె.ఉక్కాయపల్లెలో బత్తల పాలకొండమ్మ ఎన్‌పిఎం షాప్‌ను పందర్శించిన తరువాత టైప్–1. టైప్–2 జీవాంమృతం తయారు చేసినట్లు పేర్కొన్నారు. ట్రైకోడర్మ, సుడోజోన్ గురించి రైతులకు అవగాహన కల్పించడం జరిగిందన్నారు. వరిలో పొట్ట తెగులు నివారణకు ప్రొపినో కోనజోల్ లీటరు నీటికి ఒక మిల్లీ లీటరు మందును కలిపి పిచికారీ చేయాలన్నారు. వంగలో పొగాకు లద్దె పురుగు నివారణకు బరజైడ్ అనే పురుగు మందును లీటరు నీటికి 2.5 మిల్లీ లీటర్ల మందు కలిపి పిచికారి చేయాలన్నారు. అంతేగాకుండా నారపురెడ్డి మల్లికార్జునరెడ్డి మిరప పొలంలో రెండవ విడతగా ద్రవజీవామృతంను పారించడం జరిగిందన్నారు. తద్వారా రైతు సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాచుపల్లె రైతు సేవా కేంద్రం సహాయకులు లక్ష్మీదేవి, ప్రకృతి వ్యవసాయా సిబ్బంది చిన్నక్క, ఐసీఆర్‌పీలు చంద్రకళ, భాగ్యలక్ష్మీ, రైతులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల బాదుడును ఉపసంహరించుకోవాలి


రాయచోటిలో నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ శ్రేణులు

రాయచోటి (జగదాంబసెంటర్) : కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో సర్దుబాటు పేరుతో పెంచాలనుకున్న విద్యుత్ అదనపు చార్జీల ఆలోచనలను వెంటనే విరమించాలని డీసీసీ అధ్యక్షుడు గాజుల భాస్కర్ డిమాండ్ చేశారు. సోమవారం రాయచోటి పట్టణం చిత్తూరు మార్గంలో ఉన్న ఏపీఎస్పీడీసీఎల్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా డీసీసీ చీఫ్ సెక్రటరీ అమీర్ మాట్లాడుతూ ఏవేవో హామీలు ఇచ్చి అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం సామాన్య ప్రజల నడ్డి విరుస్తోందన్నారు. విద్యుత్ చార్జీలు సర్దుబాటు పేరుతో వినియోగదారుల వీపు మోపాలనే ఆలోచనలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం విద్యుత్ శాఖ ఏడీఈ విజయ్‌కు మార్‌కు వారు వినతిపత్రం అందజేశారు.

ట్రూ అప్ చార్జీలను రద్దు చేయాలి

రాజంపేట రూరల్ : ట్రూ అప్ చార్జీలను వెంటనే రద్దు చేయాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పూల భాస్కర్ డిమాండ్ చేశారు. స్థానిక డివిజన్ విద్యుత్‌శాఖ కార్యాలయం వద్ద సోమవారం ఆ పార్టీ నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు విద్యుత్ చార్జీలను పెంచము అని చెప్పి ట్రూ ఆఫ్ చార్జీలను అమలు చేసేందుకు నోటిఫికేషన్‌లు ఇవ్వడం దుర్మార్గమైన చర్య అని మండిపడ్డారు. తక్షణమే ట్రూ ఆఫ్ చార్జీలను రద్దు చేయకపోతే ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.

అయ్యప్ప నామస్మరణతో మార్మోగిన నామాలగుట్ట


అయ్యప్పకు పూజలు చేస్తున్న ఎంపీపీ మద్దిరేవుల

లక్కిరెడ్డిపల్లి : కార్తీకమాసం ప్రారంభం కావడంతో అయ్యప్ప మాలధారణ స్వీకరించిన అయ్యప్ప భక్తులు మండలంలోని నామాలగుట్టపై నిర్వహించిన పడిపూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. దీంతో గుట్టపై అయ్యప్ప నామస్మరణతో మార్మోగింది. గురుస్వాములు వెంకటేషు, గంగరాజు, సుధీర్ కుమార్, గంగాధర్ రాజుల ఆధ్వర్యంలో నిర్వహించిన పడిపూజలో అన్నమయ్య జిల్లా ఎంపీపీల సంఘం అధ్యక్షులు మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి, అనంతపురం సర్పంచ్ వెంకటనారాయణ రెడ్డిలు పాల్గొన్నారు. ఆదివారం రాత్రి గొల్లపల్లి నుంచి అయ్యప్ప స్వామి ఉత్సవ విగ్రహాన్ని ఆలయానికి చేర్చి సోమవారం ఉదయం ఉత్సవ విగ్రహాలకు గురుస్వాముల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

వీఆర్‌ఓలు ప్రజలకు అందుబాటులో ఉండాలి


మాట్లాడుతున్న తహసీల్దార్ అరవింద కిషోర్

పుల్లంపేట : ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని తహసీల్దార్ అరవింద కిషోర్ తెలిపారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా వీఆర్‌ఓలకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆన్‌లైన్ సమస్యలను సంబంధిత అధికారులు పరిష్కరించాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. వీఆర్ ఓలు గ్రామాలలో ప్రజలకు అందుబాటులో ఉంటూ వారికేమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలికి అభినందన


నగదును అందజేస్తున్న ఉపాధ్యాయురాలు

పెనగలూరు : మండలంలోని చక్రంపేట జెడ్పీహెచ్‌ఎస్‌లో బాలల దినోత్సవం సందర్భంగా ఆ పాఠశాలలో పనిచేస్తున్న హిందీ ఉపాధ్యాయురాలు కృష్ణకుమారి రూ. 10 వేలు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ సుబ్బరాయుడు, ప్రధానోపాధ్యాయుడు గోపాల కృష్ణ కుమార్‌లు మాట్లాడుతూ 14న విద్యార్థులతో క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, నగదు బహుమతుల కోసం ఉపాధ్యాయురాలు పదివేల రూపాయలు నగదును అందించినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయురాలిని ఎంఈఓ అభినందించారు.

భూ ఆక్రమణను అడ్డుకోండి

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు మండలంలోని రాఘవరాజుపురం, గంగరాజుపురం గ్రామంలోని ప్రధాన హైవేకు పక్కనే ఉన్న వంక పొరంబోకు భూమి ఆక్రమణను గురవుతోందని, దానిని అరికట్టాలని సోమవారం దొంతురెడ్డి శ్రీనివాసులు రెడ్డి, కంభం సుబ్బారెడ్డిలు ఇరిగేషన్ శాఖ అధికారులకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాఘవరాజుపురం పంచాయతీలో ఆక్రమణలను అరికట్టాలని కోరారు. వంక పొరంబోకు, ప్రభుత్వ భూములు అనుకూలంగా ఉన్నచోట ఆక్రమించుకుంటున్నారని ఫిర్యాదు చేసినట్టు వారు తెలియజేశారు.

విద్యా సంస్కరణలకు ఆద్యుడు అబుల్ కలాం

- ఘనంగా జాతీయ విద్యా దినోత్సవం
- నివాళులర్పించిన విద్యార్థులు, ఉపాధ్యాయలు, ప్రజాసంఘాలు


రాయచోటి(జగదాంబసెంటర్): ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆజాద్ చిత్రపటానికి నివాళి


సుండుపల్లి: ఉర్దూ ఉన్నత పాఠశాలలో జాతీయ విద్యా దినోత్సవ వేడుకలు

సుండుపల్లె : మండలంలోని తిమ్మసముద్రం జిల్లా పరిషత్ ఉర్దూ ఉన్నతపాఠశాలలో దేశ మొదటి విద్యాశాఖ మంత్రిగా పనిచేసిన మౌలానా అబుల్ కలాం ఆజాద్ జన్మదినాన్ని పురస్కరించుకొని సోమవారం జాతీయ విద్యా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఆరిఫుల్లా మాట్లాడుతూ బహు భాషా ప్రావీణ్యుడైన అబుల్ కలాం దేశంలో విద్యా సంస్కరణలు చేసి భావి భారత పౌరులను తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషించారన్నారు. దేశంలో సమగ్ర విద్యా విధాన రూపకల్పనకు పునాదులు వేశారన్నారు. ఇలాంటి మహోన్నత వ్యక్తిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అనంతరం విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకొని పాఠశాల ఉర్దూ ఉపాధ్యాయురాలు కలిమున్నీసా విద్యార్థులకు తిథి భోజనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సబీహా ఖానం, ఖతీబుద్దీన్, సలీం, వెంకట్ రెడ్డి, గౌసియా బేగం, విద్యార్థులు పాల్గొన్నారు.

రాయచోటిలో..

రాయచోటి టౌన్ : భాతర తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయింతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆల్మేవ జిల్లా అధ్యక్షులు పి.జుబేర్ ఆలీఖాన్ మాట్లాడుతూ ఆజాద్ స్పూర్తితో దేశ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. అందరికీ ఉచిత విద్య అందాలని విద్య సంస్కరణ కోసం కృషి చేసిన మహనీయుడని కొనియాడారు. కార్యక్రమంలో ఆల్ మేవా జనరల్ సెక్రటరీ అసదుల్లా, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జాబీర్, రూటా అన్నమయ్య జిల్లా అధ్యక్షులు సిబతూర్ రెహ్మాన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..

రాయచోటి (జగదాంబసెంటర్) : అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మౌలానా అబుల్‌కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకొని జాతీయ విద్యా దినోత్సవ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించినట్లు ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ సభ్యులు గుర్రప్ప, ప్రసాద్‌లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డా.హర్షలతాపంకజ్ మౌలానా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

దళవాయిపల్లి ప్రాథమిక పాఠశాలలో..

పుల్లంపేట : మండలంలోని దళవాయిపల్లి ప్రాథమిక పాఠశాలలో సోమవారం మౌలానా అబుల్ కలాం ఆజాద్ జన్మదినాన్ని పురస్కరించుకొని జాతీయ విద్యా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమణ మాట్లాడుతూ మౌలానా ఆజాద్ 1920లో భారత జాతీయ ఉద్యమంలో ప్రవేశించారన్నారు. ఆయన చేసిన సేవలకు ఆయన మరణాంతరం 1992లో భారతదేశం అత్యున్నత పౌర పురస్కారం భారత రత్న ప్రకటించిందన్నారు.


రాయచోటి (జగదాంబసెంటర్): శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాలలో..

శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాలలో..

రాయచోటి (జగదాంబసెంటర్) : రాయచోటి పట్టణంలోని శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాలలో దేశ మొట్టమొదటి విద్యాశాఖ మంత్రి, భారతరత్న అవార్డు గ్రహీత మౌలానా అబుల్‌కలాం ఆజాద్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో జాతీయ విద్యా దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు.

ఏయూలో వ్యాసరచన పోటీలు

రాజంపేట : అన్నమాచార్య యూనివర్సిటీలో సోమవారం జాతీయ విద్యా దినోత్సవాన్ని ఘనంగా జరిపారు. ప్రపంచ శాంతి కోసం విద్య ప్రాముఖ్యతపై టచ్‌స్టోన్ ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఇందులో విజేతలుగా నిలిచిన మేఘనా, వేదప్రసన్నలకు ప్రశంసాపత్రాలను ప్రిన్సిపల్ అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.


పుల్లంపేట: దళవాయిపల్లి ప్రాథమిక పాఠశాలలో..


రాజంపేట: విజేతలకు ప్రశంసాపత్రాలను అందజేస్తున్న ప్రిన్సిపల్


రాయచోటి టౌన్: మౌలానా చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

శివాలయాల్లో కార్తిక శోభ

కార్తిక మాసంలోని రెండవ సోమవారం సందర్భంగా మూడు నియోజకవర్గాల పరిధిలోని శివాలయాలకు భక్తులు పెద్దఎత్తున తరలి వచ్చి విశేష పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయా ఆలయాల్లోని శివుని మూలవిరాట్‌ను పుష్పాలు, పట్టువస్త్రాలతో శోభాయమానంగా అలంకరించారు. భక్తులు వేకువ జాము నుంచే శివాలయాలకు పెద్దఎత్తున తరలివచ్చి ఆలయాల్లో దీపాలను వెలిగించారు. అలాగే అనేక మంది నోములు నోచుకున్నారు.

– సాక్షి, నెట్‌వర్క్


రాజంపేట టౌన్ : స్వామివారి దర్శనం కోసం క్యూలో వేచివున్న భక్తులు


సిద్దవటం: నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో..


రాజంపేట టౌన్: అలంకరణలో రామలింగేశ్వర స్వామి


పుల్లంపేట: దర్శనమిస్తున్న పర్వతవర్ధినీ అమ్మవారు


చిట్వేలి: రుద్రాక్షల అలంకారంలో శ్యామలాంబ అమ్మవారు


చిన్నమండెం మండలం కేశాపురంలో


రామాపురం: కంభరాయుడి గుట్టపై


సంబేపల్లె: పశుపతినాథ ఆలయంలో


సిద్దవటం: కపర్థీశ్వర ఆలయంలో నోముల పూజలు చేస్తున్న మహిళలు


ఒంటిమిట్ట: కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు